క్లుప్తంగా...

నేడు ఉచిత వైద్య శిబిరం

బోడుప్పల్: శ్రీహెల్త్ కేర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, బోడుప్పల్ అఖిల బ్రాహ్మణ వికాస సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి జోషి ఒక ప్రకటనలో వెల్లడించారు. సాయి భవానీ నగర్‌లోని అఖిల బ్రాహ్మణ వికాస సమితి కార్యాలయంలో నిర్వహించే వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఫోన్: 63093 53535, 63093 63535.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన బీఎల్ఆర్



కాప్రా: మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గం అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కలిశారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కేసీఆర్‌ను కలిశారు. విదేశీ పర్యటన దిగ్విజయంగా పూర్తి చేసుకుని, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. డైనమిక్ మంత్రిగా అనునిత్యం రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

జేజీఆర్‌లో గ్రీన్ డే వేడుకలు



గ్రీన్ డే వేడుకల్లో చిన్నారులు

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రీన్ డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు పచ్చని దుస్తులతో స్కూల్‌కు హాజరయ్యారు. ప్రతి తరగతి గదిలో పచ్చని బెలూన్‌లతో విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ గ్రీన్ డే సందర్భంగా విద్యార్థులకు గ్రీన్ కలర్ కేక్‌ను కట్ చేసి పంచారు. మన చుట్టు పక్కల పచ్చని చెట్లను పెంచుకోవాలని, పచ్చని చెట్లతో ఆక్సిజన్ లభిస్తుందన్నారు. గ్రీన్ కలర్‌లో ఉండే కాయకూరలు, ఆకుకూరలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్‌బోరుకు మరమ్మతులు



పవర్‌బోరు మరమ్మతులను పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి మహంకాళి అమ్మవారి దేవాలయం వద్ద పవర్‌బోర్ మరమ్మతులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సుమారు రూ.లక్షతో కొత్త సబ్‌మెర్సిబుల్ పంపు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, శ్రీకాంత్, సునీల్‌యాదవ్, శివానంద్, రవి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

షేర్‌చాట్‌పై మ్యూజిక్ కార్నివాల్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సోషల్ మీడియా వేదిక షేర్‌చాట్.. మ్యూజిక్ కార్నివాల్ పేరుతో ఈ నెల 15వ తేదీ వరకూ సంగీత పండగను సమర్పిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. దీనిలో భాగంగా వినియోగదారులు 90ల నాటి అద్భుతమైన పాటల్ని వినవచ్చని, అలాగే 10 భాషల్లోని ప్రైవేట్ ఆల్బమ్స్, టేలెస్ట్ హిట్ సాంగ్స్.. మ్యూజిక్ ట్రెండ్స్.. అందుకోవచ్చని వివరించారు. అంతేగాకుండా వినియోగదారులు తమ సొంత సంగీత వీడియోలను సైతం రూపొందించుకోవచ్చని అన్నారు.



మంత్రి మల్లారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బోడుప్పల్ నేతలు



మంత్రి మల్లారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పీర్జాదిగూడ నేతలు

ఘనంగా మంత్రి మల్లారెడ్డి జన్మదిన వేడుకలు

మేడ్చల్‌రూరల్: రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. మంత్రి జన్మదినం సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలో పెద్ద ఎత్తున త్రైలోక్య మోహన చండీ హోమం నిర్వహించారు. మంత్రి మల్లారెడ్డి–కల్పన దంపతులతో పాటు కుమారులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, కోడళ్లు షాలినీరెడ్డి, ప్రీతిరెడ్డి, సోదరుడు గోపాల్‌రెడ్డి, కుటుంబీకులు, బంధువులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హోమం జరిగింది. అనంతరం గోపూజ నిర్వహించారు. తన జన్మదినం సందర్భంగా మంత్రి తన కుటుంబీకులు, గుండ్లపోచంపల్లి మున్సిపల్ పాలకవర్గంతో కలిసి మొక్కలు నాటారు.

పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు..

మంత్రి మల్లారెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించిన త్రైలోక్య మోహన చండీ హోమంలో కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఎమ్మెల్యేలు వివేకానంద, బేతి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రి మల్లారెడ్డి తన జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలోని డ్వాక్రా గ్రూప్ మహిళలకు మల్లారెడ్డి మెడికల్ హబ్ ద్వారా ఉచితంగా హెల్త్ కార్డులు అందజేశారు.



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గం అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



మంత్రి మల్లారెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో హోమం

బీజేపీ సీటు కేటాయించాలంటూ దరఖాస్తులు



దరఖాస్తును అందజేస్తున్న దండుగుల వెంకటేష్



దరఖాస్తు అందజేసిన బక్క నాగరాజు



బీజేపీ ఉప్పల్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు అందజేసిన ఎనుముల మహేష్‌కుమార్

అల్వాల్: రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరి బీజేపీ అసెంబ్లీ సీటును కేటాయించాలని కోరుతూ అల్వాల్ మచ్చబొల్లారం ప్రాంతానికి చెందిన బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దండుగుల వెంకటేష్ శనివారం నగరంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తన దరఖాస్తును సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా బీజేపీ పటిష్టతకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

బీజేపీ టికెట్టు కోసం దరఖాస్తు

మల్కాజిగిరి: స్వచ్ఛ భారత్ అభియాన్ మల్కాజిగిరి కన్వీనర్, కంటెస్టెడ్ కార్పొరేటర్ బక్క నాగరాజు మల్కాజిగిరి అసెంబ్లీ టికెట్టు కోసం పార్టీ కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బీసీ సామాజికవర్గంతో పాటు యువతకు ప్రాధాన్యత ఇస్తుందన్న నమ్మకం ఉందన్నారు.

బీజేపీ ఉప్పల్ అభ్యర్థిగా దరఖాస్తు అందజేసిన ఎనుముల

కుషాయిగూడ: బీజేపీ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నట్లు మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత ఎనుముల మహేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన దరఖాస్తు అందజేశారు. నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి దరఖాస్తు సమర్పించినట్లు పేర్కొన్నారు. బీజేపీ నేతలు రవీందర్‌రెడ్డి, ఫణీందర్, రాజేశ్వర్, బాలరాజు, సూర్యప్రకాశ్, నర్సింగ్, ఆనంద్, నరసింహారెడ్డి, లింగం, శ్రావణ్‌గౌడ్ దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కు టికెట్ ఇవ్వాలి

రామంతాపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌కే అవకాశం ఇవ్వాలని కోరుతూ రామంతాపూర్‌కు చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు, నేతలు ప్రధాన కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. బీజేపీ నేతలు జగన్ యాదవ్, బాలకృష్ణగౌడ్, వెంకట్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, తిరుపతయ్య పాల్గొన్నారు.

అదుపులో లేని నిత్యావసర ధరలు



ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన చేపట్టిన సీపీఎం నేతలు

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో నిత్యావసరాల ధరలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, సీపీఎం నగర మాజీ కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం అఖిల భారత కమిటీ పిలుపు మేరకు శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల పెరుగుదల, నిరుద్యోగం కారణంగా దేశంలో కోట్లాది మంది పేదరికంలో మగ్గుతున్నారన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేసి కార్మికులను కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా చేసిందన్నారు. కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేసి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జె.చంద్రశేఖర్, సర్కిల్ కార్యదర్శి జి.శ్రీనివాసులు, శ్రీనివాస్, గణేష్, వరప్రసాద్, యాదగిరిరావు, దేవిరెడ్డి, శోభ, ఉన్నికృష్ణ, లక్ష్మీనారాయణ, ప్రసాద్, సోమయ్యాచారి, రాజు, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కుషాయిగూడ: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున సైనిక్‌పురి నుంచి ఈసీఐఎల్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వేగంగా దూసుకొచ్చిన కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

కుషాయిగూడ: ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నేత సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో కుషాయిగూడ బస్టాప్ వద్ద ఓటరు నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు విధిగా ఓటును నమోదు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ నేతలు సీతారాంరెడ్డి, గడ్డం యాదగిరి, వీరేష్, పంజాల బాబుగౌడ్, దినేష్, నాను తదితరులు పాల్గొన్నారు.



ఓటరు నమోదు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి

ఇంకా సమయం కావాలి

తిరుమలలో మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: వారం తర్వాత ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటానని చెప్పానని, ఇంకా సమయం కావాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. తిరుపతి పర్యటనలో ఉన్న ఆయన రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చాలాసార్లు తిరుపతికి వచ్చినప్పటికీ ఎన్నడూ రాజకీయాలు మాట్లాడలేదన్నారు. మొదటిసారి ఇటీవల మాట్లాడానన్నారు. దేవుడి ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదని అంటారని, ఏదిఏమైనా శ్రేయోభిలాషులు దైవ సన్నిధిలో రాజకీయాలు మాట్లాడవద్దని చెప్పారన్నారు. నేను ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ప్రజల నిర్ణయం తీసుకొని పోటీ చేశానే తప్ప గెలిచిన తర్వాత పార్టీలు మారలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నేను చెప్పిన వారం రోజుల తర్వాతే ఒక ఫంక్షన్‌లో మీడియా మిత్రులతో సాధారణ సమావేశం జరిగిందన్నారు. వారందరూ నాకు శ్రేయోభిలాషులేనన్నారు. పత్రికా సమావేశం నిర్వహించలేదన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలందరికీ సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకోలేమని, ఇంకా సమయం కావాలన్నారు.



తిరుమలలో ఎమ్మెల్యే మైనంపల్లి

లోక్ అదాలత్‌లతో కేసుల సత్వర పరిష్కారం

కుషాయిగూడ: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు చక్కటి వేదికలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ మధుసూదన్‌రావు అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడలోని మేడ్చల్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 22 బెంచ్‌లను ఏర్పాటు చేసి 79,639 కేసులకు పరిష్కారం చూపి పరిహారంగా రూ.1.13 కోట్లను చెల్లించినట్లు న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్‌రెడ్డి, జిల్లా అదనపు న్యాయమూర్తి ఆర్.రఘునాథ్‌రెడ్డి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డి.కిరణ్‌కుమార్, కుషాయిగూడ, మల్కాజిగిరి ఏసీపీలు వెంకట్‌రెడ్డి, సుకుమార్, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి బీఆర్ మధుసూదన్‌రావు

ఉప్పల్‌లో కాంగ్రెస్‌దే విజయం

ఏ బ్లాక్ అధ్యక్షుడు ఎంపీఆర్

రామంతాపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అదేవిధంగా ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌దే విజయమని, అందుకు కార్యకర్తలు, నేతలు ఐక్యంగా కృషి చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. గడపగడపకూ కాంగ్రెస్‌లో భాగంగా శనివారం రామంతాపూర్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్ అరవింద్‌నగర్, రాజేంద్రనగర్, గాంధీనగర్ కాలనీల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కుటుంబం దోపిడీ చేస్తోందని, దోపిడీ చేసిన సొమ్ముతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధులు మేకల శివారెడ్డి, తోఫిక్, పసుల ప్రభాకర్‌రెడ్డి, కంది ఆగిరెడ్డి, రఫిక్, గిరిబాబు, మురళిగౌడ్, శ్రవణ్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో..

ఉప్పల్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తాం

మల్లాపూర్: అన్ని వర్గాల ప్రజల ఆదరణతో ఉప్పల్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ఉప్పల్ నియోజకవర్గం ఎంబీసీ చైర్మన్ సంగిశెట్టి రవీందర్ సాగర్ దీమా వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. ఉప్పల్‌లో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సామాన్య కార్యకర్తగా ఉంటూ ప్రజలకు సేవకుడిగా పని చేస్తున్నాడన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నేతలు రామయ్య, సత్యనారాయణ, లింగంగౌడ్, వీరయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంగిశెట్టి రవీందర్ సాగర్

వేల కుటుంబాల్లో సంతోషం నింపిన కేసీఆర్



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు

కుషాయిగూడ: ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వేల కుటుంబాల్లో సంతోషం నిండిందని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలో ఇండస్ట్రియల్ జోన్‌లో ఉన్న డైమండ్ హిల్స్ కాలనీ, న్యూనర్సింహనగర్, తిరుమలనగర్ ఎక్స్‌టెన్షన్ కాలనీలను రెసిడెన్షియల్ జోన్‌లోకి మారుస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. శనివారం హెచ్‌బీకాలనీ ప్రధాన కూడలిలో ఆయా కాలనీవాసులో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నేతలు మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాలరాజు, నరసింహ, మల్లేష్, శ్రీనివాస్, శివ, చంద్రకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

గౌతంనగర్: అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో రూ.38 లక్షలతో కొనసాగుతున్న బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులను ఆమె శనివారం పరిశీలించారు. త్వరలో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



పీర్జాదిగూడలో మెగా రక్తదాన శిబిరం



మేడిపల్లి: మంత్రి చామకూర మల్లారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పీర్జాగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ చాణ్యకపురి కాలనీలో ఎమ్మెల్యే నిధులు రూ.79 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుదేవ్‌గౌడ్, కాలనీవాసులు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్ చాణ్యకపురి కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



వాగ్దేవి కళాశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

రామంతాపూర్: ఇందిరానగర్‌లో శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి వాగ్దేవి మహిళా డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది మంచి పౌరులుగా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఆర్.సురేష్‌గౌడ్, ఉప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి, టీఆర్ఎస్ నేతలు గరికె సుధాకర్, మహ్మద్ ముస్తాక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

కుషాయిగూడ: స్థానిక సమస్యలపై కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా కుషాయిగూడలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తానని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు పనగట్ల చక్రపాణిగౌడ్, చిత్తుల కిషోర్, వరప్రసాద్, వాసుదేవ, బ్రహ్మచారి, అనిల్, నర్సింగ్, దినేష్, జనార్దన్, శంకర్, మణికిరణ్, శ్రీనివాస్, వినోద్‌వారి, సత్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

హబ్సిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని కోరుతూ కుషాయిగూడ సంక్షేమ సంఘం సభ్యులు శనివారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. సంక్షేమ సంఘం సభ్యులు చక్రపాణిగౌడ్, శ్రీనివాస్, వినోద్, కిషోర్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, వాసుదేవ్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.